పంచాయతీలకు కొత్త మార్గదర్శకాలు

- గత నెలలో నిర్వహించిన వర్క్‌షాప్ ద్వారా కార్యదర్శులకు అవగాహన 7

రాజీవ్‌గాంధీ అడుగుజాడల్లో నడుద్దాం


సంగారెడ్డిలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

రాజీవ్‌గాంధీ వర్ధంతిలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ అడుగుజాడల్లో నడవాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం సంగారెడ్డిలోని రాజీవ్‌పార్కులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రధానిగా రాజీవ్‌గాంధీ హయాంలో తీసుకువచ్చిన సంస్కరణలు అన్నివర్గాల వారికి సత్ఫలితాలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలతోనే సాంకేతికంగా దేశం అభివృద్ధి చెందిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నిర్మలా జగ్గారెడ్డి సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్‌కుమార్, కిరణ్ గౌడ్, మహేశ్, కసిని రాజు, నాగరాజు, ఉదయ్‌భాస్కర్, తాహేర్‌పాష, సునీల్, సోహెబ్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్ పార్కులో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి తదితరులు

నేత్రపర్వంగా మహాకుంభాభిషేకం

సిద్దిపేట కల్చరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా కేంద్రం మోహినిపురలోని శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం త్రిదండి చినజీయర్ స్వామిజీ చేతుల మీదగా మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఉదయం తీర్థగోష్టి నిర్వహించారు. ఉత్సవాల్లో చినజీయర్ స్వామిజీతో పాటుగా మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి చినజీయర్ స్వామిజీ అనుగ్రహభాషణం చేశారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ స్వర్ణోత్సవాల్లో త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి పాల్గొని మూడురోజుల పాటు మనల్ని అనుగ్రహించడం మన అదృష్టమన్నారు. భక్తిమార్గాన్ని మించిన మార్గం ఇంకొకటి లేదని, భగవంతుని సేవలో ఉండడం ద్వారా మనసు తేలికవుతుందని చెప్పారు. ఈ ఆలయాన్ని 1975లో పెద్దజీయర్ స్వామి పర్యవేక్షణలో ప్రతిష్ఠ చేసుకున్నామని, 1991లో రాజగోపురం చినజీయర్ స్వామి పర్యవేక్షణలో చేసుకున్నామని, మళ్లీ ఈ స్వర్ణోత్సవాలు చినజీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరగటం అదృష్టమని ఆయన పేర్కొన్నారు. ఇక అన్నదాన సత్రానికి అవసరమైన గ్రానైట్‌ని 15 రోజుల్లో ఏర్పాటు చేస్తానని చెప్పారు.


మహాకుంభాభిషేకం చేస్తున్న చినజీయర్ స్వామిజీ, పక్కన హరీశ్‌రావు

'చెత్త.. చెత్త'పై కలెక్టర్ ఆరా

- సమసిన పారిశుధ్య కార్మికుల వివాదం
- నేటి నుంచి విధుల్లో చేరేందుకు సిద్ధం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గజ్వేల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న 'ఆంధ్రజ్యోతి' పత్రికలో ప్రచురితమైన "చెత్త చెత్త" కథనంపై సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి ఆరా తీశారు. మల్లన్నసాగర్ నిర్వాసిత గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తపై ఆరా తీసిన ఆయన పారిశుధ్య కార్మికులతో మాట్లాడాలని మునిసిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ ఇచ్చినట్లు తెలిసింది. కమిషనర్ 33 మంది పారిశుధ్య కార్మికులతో మాట్లాడి పెండింగ్ వేతనాలు, వారి ఉద్యోగ భద్రతపై క్లారిటీ ఇవ్వడంతో తాము విధుల్లో చేరడానికి సిద్ధంగా ఉన్నామని పారిశుధ్య కార్మికులు తెలిపారు. గురువారం నుంచి కార్మికులు విధుల్లో చేరనున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి మల్లన్నసాగర్ భూనిర్వాసిత గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాకు పచ్చిరొట్ట విత్తనాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సిద్దిపేట కలెక్టరేట్, మే21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19న "పచ్చిరొట్ట విత్తనాలు ఏవి" అంటూ.. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం జిల్లాకు 150 క్వింటాళ్ల జీలుగ, 600 క్వింటాళ్ల జనుము వచ్చినట్లు వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు.

పెరిగిన ధరలు..

ఈ ఏడాది వచ్చే జీలుగ, జనుము విత్తన ధరలు పెరిగాయి. గతేడాది జీలుగ 30 కేజీల బస్తాకు సబ్సిడీ పోను రైతు వాటాగా రూ.1,116, జనుము 40 కేజీల బస్తాకు రూ.1,448 అందించారు. ఈ ఏడాది ధర పెరగడంతో సబ్సిడీ పోను 30 కేజీల జీలుగు బస్తాకు రూ.2,137, జనుము 40 కేజీల బస్తాకు రూ.2,510 చొప్పున విక్రయించనున్నారు.

వర్షాకాలం సమీపించినా యాసంగి ధాన్యం కొనుగోళ్లు లక్ష్యం చేరలేదు. ఫలితంగా అన్నదాతకు ఆపసోపాలు తప్పడం లేదు. నారు వేసిన నాటి నుంచి ధాన్యాన్ని మిల్లుల్లోకి తరలించేవరకు అనేక ఆటంకాలు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు అకాల వర్షాల బీభత్సం సరేసరి. రాత్రింబవళ్లు పంట దిగుబడి కోసం చెమట చిందించడం ఒకెత్తయితే.. ఆ పంటను విక్రయించడానికి రోజుల కొద్దీ పడిగాపులు పడడం మరో ఎత్తవుతున్నది. అధికార యంత్రాంగం లోపంతో జిల్లా వ్యాప్తంగా రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మే21



వర్గల్‌లో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు, మొలకలుగా మారిన ధాన్యాన్ని చూపుతున్న మహిళా రైతు

అన్నదాత అరిగోస..

అకాల వర్షాలతో రైతుల అష్టకష్టాలు

- కొనుగోలు కేంద్రాల్లో సమస్యల తిష్ఠ
- ధాన్యం కుప్పల వద్దే రైతుల పడిగాపులు
- లారీల జాప్యంతో తడిసిముద్దవుతున్న ధాన్యం
- వర్షాకాలం సమీపించినా లక్ష్యం చేరని కొనుగోళ్లు
- అధికారులు దృష్టిసారిస్తేనే అన్నదాతలకు ఊరట

జిల్లావ్యాప్తంగా 419 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తున్నారు. ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 26 కేంద్రాలను మూసివేశారు. మిగితా కేంద్రాల్లో ఇంకనూ ధాన్యం సేకరణ జరుగుతోంది.

టార్పాలిన్లు లేవు.. లారీలు రావు..

యాసంగి సీజన్‌లో జిల్లావ్యాప్తంగా సుమారు 3.50లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. దాదాపు 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కానీ పంట చేతికొచ్చే సమయంలోనే వారం పాటు అకాల వర్షాలు, వడగండ్లు వరిసాగును అతలాకుతలం చేశాయి. దాదాపు లక్ష ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. దీంతో 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే అవకాశం ఉంటుందని అంచనా వేశారు. 419 కేంద్రాలను ఏర్పాటు చేసి త్వరితగతీన సేకరించాలని నిర్ణయించారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో కేంద్రాల్లో సమస్యలు తిష్ఠవేశాయి. చాలా కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేవు. లారీల కొరత దాపురించింది. ఈ సమస్యలన్నింటితో ధాన్యం సేకరణ ఊపందుకోలేదు. రైతులు పదిరోజులుగా కేంద్రాల్లోనే పడిగాపులు పడుతున్నారు. నేటికీ 2.83లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించారు.

చేనులోనే దెబ్బ.. ఇక్కడా..

ఇప్పటికే అకాల వర్షాలతో చేనులో ఉన్న వరి దెబ్బతిన్నది. ఆ తర్వాత కేంద్రాలకు తెచ్చిన ధాన్యం రాశులు తడిసిముద్దవుతున్నాయి. ఓ వైపు ఎండలు మండుతున్నప్పటికీ మరోవైపు అకాల వర్షాలు వణుకుపుట్టిస్తున్నాయి. దాదాపు 95 శాతం పంట కోయడంతోపాటు ధాన్యాన్ని కేంద్రాలకు తరలించారు.


హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో వర్షానికి తడుస్తున్న ధాన్యం


దుబ్బాక మండలం రాజక్కపేట కొనుగోలు కేంద్రంలో వర్షానికి మొలకలుగా మారిన ధాన్యం

రూ.156 కోట్లు పెండింగ్..

జిల్లాలో ఇప్పటి వరకు 2.83లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 5362 టన్నుల సన్నరకం ధాన్యం సేకరించారు. దొడ్డు రకం ధాన్యానికి రూ.658 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేయాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం రూ.512 కోట్లు మాత్రమే అందజేశారు. ఇక సన్న రకం ధాన్యానికి రూ.12కోట్లకు రూ.8కోట్లు మాత్రమే చెల్లించారు. సన్నరకానికి రూ.2.6కోట్ల బోనస్ డబ్బు రావాల్సి ఉంది. మొత్తంగా రూ.156 కోట్ల వరకు డబ్బు రైతుల ఖాతాల్లో జమ కావాలి.

మిగతా 8లో..

జిల్లాలో జోరు వాన 8


మద్దూరు కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

లారీలు లేక వడ్లు తడిసిపోయాయి



292 బస్తాల వడ్లను వారం క్రితమే సిద్దిపేట మార్కెట్‌కు తీసుకొచ్చాను. రేపుమాపు అంటూ మంగళవారం వడ్లు తూకం కోసం పెట్టారు. కానీ లారీలు లేక జాప్యం చేశారు. రాత్రి 9గంటల వరకు లారీల కోసం ఎదురుచూశాను. బుధవారం ఉదయం లేచి చూడగానే వడ్ల బస్తాలన్నీ తడిసిపోయాయి. రైతులపై పూర్తిగా నిర్లక్ష్యం చూపిస్తున్నా రు.

- తిబ్బరబోయిన ఎల్లయ్య, రైతు, ఎన్సాన్‌పల్లి, సిద్దిపేట

పదిరోజులుగా ఇక్కడే నిద్ర



కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి పదిరోజులు అవుతున్నది. ఉదయం ఎండ, రాత్రి వర్షంతో వడ్లు ఆరడం లేదు. తేమ విషయంలో మా బాధను అర్థం చేసుకోవడం లేదు. పదిరోజులుగా ధాన్యం కుప్పల వద్దనే కాపలా ఉంటున్నాను. ఇక్కడే నిద్రపోతున్నా. ధాన్యం ఎప్పుడు కొంటారో మాత్రం చెప్పడం లేదు.

- మామిండ్ల రాజు, రైతు, వర్గల్

ఒక్క అధికారి కూడా ఇటు రాలేదు



బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యమంతా తడిసింది. తూకం అయినప్పటికీ లారీ పంపమంటే పంపలేదు. మూడు రోజుల కిందట మిల్లుకు ధాన్యం పంపిస్తే వడ్లు తక్కువగా వచ్చాయని 1500 రూపాయల చొప్పున కట్ చేశారు. టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినా ఫలితం లేదు. ఒక్క అధికారి కూడా ఇటు వైపు రాలేదు.

- నాయిని సత్తయ్య, రైతు, మద్దూరు

కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉత్సాహంగా పనిచేయాలి
- రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట/కోహెడ/హుస్నాబాద్/హుస్నాబాద్ టౌన్ మే 21 (ఆంధ్రజ్యోతి): అందరం కలిసికట్టుగా కాంగ్రెస్ పార్టీని గ్రామగ్రామాన మరింత బలోపేతం చేసేందుకు పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం అక్కన్నపేట మండలంలో, కోహెడలో, హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పనిచేసినట్లే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బలంగా పనిచేసి మెజార్టీ ఎంపీటీసీలు, సర్పంచులు గెలిపించుకోవాలని కార్యకర్తలను కోరారు. తాను నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రతీ సంక్షేమ పథకాన్ని గడపగడపకు తీసుకెళ్లి పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకురావాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల్లో 20 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల నిర్మాణం పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని కాల్వలను అడ్డుకునే ప్రయత్నం చేయవద్దని రైతులను కోరారు. అనంతరం హుస్నాబాద్‌లో 150 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. ఆయా సమావేశాల్లో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మండల అధ్యక్షులు పలువురు పాల్గొన్నారు.

పొన్నం లేఖకు కేంద్ర మంత్రి సానుకూల స్పందన

హుస్నాబాద్ నుంచి అక్కన్నపేట మీదుగా జనగామ వరకు డబుల్ లేన్‌గా ఉన్న రోడ్డును ఫోర్‌లేన్‌గా మార్చాలని జాతీయ రహదారులు, రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి రాసిన లేఖకు సానుకూలంగా స్పందించారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ రోడ్డు అంశాన్ని పరిశీలిస్తున్నామని పేర్కొనడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు.

రాజీవ్‌గాంధీకి నివాళులర్పించిన మంత్రి

మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు.



అక్కన్నపేటలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



పోరాటం ఫలించే..

- ఎస్టీ జాబితాలోకి నక్కల కులస్థులు
- సామాజిక సమరసత వేదిక నేతృత్వంలో ఎనిమిదేళ్లుగా ఉద్యమం
- రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల కుటుంబాలకు లబ్ధి
- సిద్దిపేట జిల్లాలో 600 కుటుంబాలు
- చిన్నముత్యంపేట వాసులకు సర్టిఫికెట్లు అందజేత 7

అడుగడుగునా దుబ్బాకపై వివక్ష

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాక, మే 21(ఆంధ్రజ్యోతి): "ప్రభుత్వం దాదాపు పదేళ్ల పాటు దుబ్బాకకు ఎడమ చేయి చూపిందే తప్ప ఏనాడూ న్యాయం చేయలేదు. నేను మూడేళ్లు మొత్తుకున్నా.. రఘునందన్‌రావు ఆరోజు చెప్పిందే ఈరోజు దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి చెబుతున్నారని" మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు పేర్కొన్నారు. ఆలస్యంగానైనా ప్రభాకర్‌రెడ్డికి తెలిసొచ్చిందని, ఆరోజు తాను చెప్పిన మాటనే ఈ రోజు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి బయటపెడుతున్నారంటే దుబ్బాక ప్రజలు ఆలోచించాలని ఆయన అన్నారు. ఎంపీ నిధులతో దుబ్బాకలో నిర్మించిన మెడికల్ అసోసియేషన్ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికల్ అసోసియేషన్ నాయకులు వడ్లకొండశ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. తను ఊపిరి ఉన్నంత వరకు దుబ్బాక గడ్డకోసం పని చేస్తానన్నారు. గజ్వేల్, సిద్దిపేట రోడ్లు ఎలా ఉన్నాయని ఆనాడు ప్రశ్నించానన్నారు. దుబ్బాక డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభాన్ని అడ్డుకుంటే తాను పంచానని, దానిని కూడా రాజకీయం చేసి విద్యుత్ సరఫరా నిలిపేశారని గుర్తు చేశా రు. దుబ్బాక ప్రజలతో ఆవేదనను పంచుకోవాలని అనిపించి ఈ విషయాలను చెబుతున్నట్లు వివరించారు. దుబ్బాక నియోజకవర్గాన్ని ఎవరూ పట్టించుకోకపోతే, తాను కొట్లాడానన్నారు. మెదక్, సిద్దిపేట జిల్లాలను కలిపి, జాతీయ రహదారిని తెచ్చానన్నారు. ఇప్పుడు గెలిచినాయన ఏవిధంగా నన్ను ఇబ్బంది పెట్టారో అందరికీ తెలుసునన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రఘునందన్ రావుకు పేరు వస్తుందని డబుల్‌బెడ్‌రూం ఇళ్లను, వందపడకల ఆసుపత్రిని, దుబ్బాక రోడ్లను ఆపేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్తాబాద్-దుబ్బాక రహదారికి నిధులు తెచ్చామన్నారు. ఆసుపత్రిని కొట్లాడి ప్రారంభించామన్నారు. దుబ్బాకలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి హబ్షీపూర్ అంబేడ్కర్ విగ్రహం వరకు డబుల్ రోడ్డు, దుబ్బాక నుంచి మల్లాయపల్లి, మల్లన్నగుట్టకు రహదారిని ఏర్పాటు చేసి తీరు తానన్నారు. సమావేశంలో నాయకులు ఆర్, రాజమౌళి, ప్రభాకర్ పాల్గొన్నారు.


రఘునందన్‌రావును సన్మానిస్తున్న మెడికల్ అసోసియేషన్ సభ్యులు



అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై కేసు

● రెండు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

జిన్నారం, మే 21, (ఆంధ్రజ్యోతి): గడ్డపోతారం శివారులోని ప్రభుత్వ భూమి నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవీందర్‌రెడ్డి తెలిపారు. గడ్డపోతారం 79 సర్వే నెంబర్ ప్రభుత్వ భూముల నుంచి రాత్రి వేళ అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని రెవెన్యూ శాఖ అధికారులకు సమాచారమందింది. ఈ మేరకు బుధవారం తెల్లవారు జామున అధికారులు దాడులు నిర్వహించి మట్టిని తరలిస్తున్న 2 టిప్పర్లు, 2 ఎక్స్‌కవేటర్‌లను స్వాధీనం చేసుకున్నారు. వాటి యజమానులు, డ్రైవర్ల పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో..

26 మందికి గాయాలు

మెదక్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 26 మందికి గాయాలయ్యాయి. శివ్వంపేట మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 3 వాహనాలు ధ్వంసం కాగా 8 మందికి తీవ్రగాయాలయ్యాయి. తూప్రాన్ మండలంలో 8 మంది, రామాయంపేటలో 10 మందికి గాయాలయ్యాయి. బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటనల్లో 20 మంది తీవ్ర గాయాలు కాగా, ఆరుగురు స్వల్పగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

\- శివ్వంపేట/తూప్రాన్/ రామాయంపేట, మే 21 (ఆంధ్రజ్యోతి)



శివ్వంపేట: డీసీఎం ఢీకొని నుజ్జునుజ్జయిన టవేరా వాహనం



రామాయంపేట హైవేపై ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొన్న లారీ



తూప్రాన్: యావాపూర్ శివారులో జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన బాధితులు

శివ్వంపేట మండలంలో..

శివ్వంపేట మండలంలో టవేరా వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన డీసీఎం బలంగా కొనడంతో లారీ కిందికి టవేరా దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లి మండలం ముంద్రాయి గ్రామానికి చెందిన బుర్గారి విఠల్‌కు చెందిన టవేరా వాహనంలో మంగళవారం రాత్రి డ్రైవర్ శ్రీనివాస్ మండల పరిధిలో గోమారం గ్రామానికి శుభకార్యానికి వచ్చి కౌడిపల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. అదే సమయంలో చిన్న గొట్టిముక్ల బాయన్న చెరువు సమీపంలో నర్సాపూర్ వైపు నుంచి ఎదురుగా లారీలు వస్తుండడంతో నర్సాపూర్ వైపునకు వెళ్తున్న లారీ డ్రైవర్ రోడ్డు పక్కన లారీని ఆపుకొని ఉన్నాడు. కాగా ఆపి ఉన్న లారీ వెనుక వైపు నుంచి వస్తున్న టవేరా వాహనాన్ని ఆ వెనుకే వస్తున్న డీసీఎం బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో టవేరా లారీ కింద దూసుకొవెల్లి నుజ్జునుజ్జయింది. అందులో ప్రయాణిస్తున్నకౌడిపల్లిమండలంలోని ముంద్రా యి, వెల్మకన్న, తునికి, చిప్పలతుర్తి గ్రామాలకు చెందిన 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ధ్వంసమైన డీసీఎం టవేరా వాహనాలను బుధవారం ఉదయం పోలీస్ స్టేషన్ తీసుకురాగా, లారీని నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తూప్రాన్‌లో..

బొలెరో వాహనం ద్విచక్రవాహనాన్ని ఓవర్ టేక్ చేసే యత్నంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టిన ఘటనలో 8మందికి గాయాలయ్యాయి. తూప్రాన్ మండలం యావాపూర్ శివారులో రైల్వే బ్రిడ్జి వద్ద బుధవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకున్నది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం.. తూప్రాన్‌లో నివాసముండే తాపీ మేస్త్రీలు పరిశపోగు రమేష్, కల్లు శివ, లింగాల మరియదాస్, పరిశపోగు ప్రవీణ్, కల్లు సురేష్‌లు కారులో తూప్రాన్ నుంచి సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అంతగిరిపల్లి గ్రామానికి పనులు చేసేందుకు బయలుదేరారు. అదే సమయంలో సిద్దిపేట నుంచి బొలెరో వాహనంలో చింతమడక గ్రామానికి చెందిన కాముని సత్యనారాయణ, యశ్వంత్, కెత్వాన్‌లు తూప్రాన్ వైపు వస్తున్నారు. అదే రోడ్డుపై గుంటూరు జిల్లాకు చెందిన కుంభ శంకర్ (50) మోపెడ్ వాహనంపై ప్రయాణిస్తుండగా బొలెరో వాహనం మోపెడ్‌ను ఓవర్‌టేక్ చేసే యత్నంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ సంఘటనలో రమేష్, శివ, ప్రవీణ్, సురేష్, శంకర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. బొలెరోలో వెళ్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా క్షతగాత్రులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

రామాయంపేటలో..

రామాయంపేట హైవే, సిద్దిపేట రోడ్డులో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పదిమంది గాయపడ్డారు. బుధవారం రెండు చోట్ల ఈ ఘటనలు జరిగాయి. మేడ్చల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రామాయంపేటకు వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. అలాగే సిద్దిపేట చౌరస్తాలో ఆటో, కారు ఢీకొన్న ఘటనలో ఏడుగురు ఆటో ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.





లారీల కోసం రోడ్డెక్కిన అన్నదాత

● మెదక్- సంగారెడ్డి రహదారిపై గంటపాటు ధర్నా



రంగంపేటలో రైతులను సముదాయిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

కొల్చారం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం పండించిన పంట వర్షార్పణం కావడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. బుధవారం మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలోని రంగంపేట గ్రామంలో మెదక్-సంగారెడ్డి ప్రధాన రహదారిపై పైతర గ్రామ రైతులు పెద్ద ఎత్తున వచ్చి దాదాపు గంటపాటు ధర్నా, రాస్తారోకో చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. వారం రోజుల నుంచి పది లారీలు ధాన్యం నింపి నిలువ ఉంచామన్నారు. లారీలు రాకపోవడంతో ధాన్యం వర్షానికి తడిసి ముద్దవుతున్నా, అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్‌చారి వెంటనే ఘటనాస్థలానికి వచ్చి రైతులను సముదాయించారు. ప్రస్తుతం రెండు లారీలు పంపుతున్నట్లు ఆయన తెలిపారు.

ధాన్యాన్ని వెంటనే మిల్లర్లకు తరలించాలి: సునీతాలక్ష్మారెడ్డి

లారీల కొరత లేకుండా వెంటనే రైతుల ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు పంపించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ శివ్వంపేట్, కొల్చారం, చిలప్‌చెడ్ మండలాల్లో లారీల కొరత ఉండడంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం నింపిన బస్తాలు అలాగే ఉన్నాయన్నారు. జిల్లా అధికారి డీఎం డీఎస్‌వోతో మాట్లాడానని, వెంటనే ధాన్యాన్ని తరలించాలని రైతుల పక్షాన మాట్లాడినట్లు తెలిపారు.

నిందితుల ఫొటోలు విడుదల

మెదక్అర్బన్, మే21(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల ఫొటోలను పట్టణ పోలీసులు బుధవారం విడుదల చేశారు. సదరు వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తే.. 8712657913, 8712657878 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పట్టణ సీఐ నాగరాజు కోరారు.



పోలీసులు విడుదల చేసిన నిందితుల ఫొటోలు

వర్షంలో బైక్ అదుపు తప్పి యువకుడి మృతి



జగదీశ్(ఫైల్)

నంగునూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): వర్షంలో బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మండలంలోని ముండ్రాయి గ్రామశివారు సురభి ఆస్పత్రి వద్ద చోటు చేసుకున్నది. మండలంలోని రాజగోపాలపేటకు చెందిన కొక్కొండ జగదీష్(24) అనే యువకుడు సిద్దిపేట నుంచి రాజగోపాల్ పేటకు వర్షంలో బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. జగదీష్ స్వగ్రామమైన ఎర్రవల్లి మల్లన్నసాగర్‌లో మునిగిపోవడంతో కొంతకాలంగా రాజగోపాలపేటలోని అమ్మమ్మ ఇంటిదగ్గర తల్లి భాగ్యవ్వ, తమ్ముడు మధు తో కలిసి ఉంటున్నారు. సిద్దిపేటలోని ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ పని ముగించుకొని ఇంటికి వస్తుండగా ప్రమాదం జరిగిందని గ్రామస్థులు తెలిపారు.

భవనంపై నుంచి పడి.. చికిత్స పొందుతూ..



గొల్ల స్వామి(ఫైల్)

తూప్రాన్, మే 21(ఆంధ్రజ్యోతి): భవనం దాబాపై పడుకున్న వ్యక్తి ఫిట్స్‌తో కింద పడి తీవ్ర గాయాలు కాగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన బుధవారం తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌లో చోటు చేసుకున్నది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన నర్ర గొల్లస్వామి (45) కొంత కాలంగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నెల 16న రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భవనం దాబాపై పడుకున్నారు. రాత్రి నిద్ర నుంచి లేచి మూత్ర విసర్జనకు వెళ్లే సమయంలో ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన గొల్లస్వామిని చికిత్స కోసం తూప్రాన్ ఆసుపత్రికి తీసుకెళ్లి మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఆపరేషన్ కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మంజీరాలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కొల్చారం, మే 21 (ఆంధ్రజ్యోతి): మంజీరా నదిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి శివారు మొదటి బ్రిడ్జి వద్ద మంజీరాలో చోటు చేసుకున్నది. జాలర్లు బుధవారం ఉదయం చేపలు పట్టడానికి వెళ్లగా మృతదేహం కనిపించడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పంచాయతీ కార్యదర్శి అరుంధతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి బ్లూ కలర్ షర్ట్, నలుపు రంగు జీన్ ప్యాంటు ఉంది.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య



కృష్ణ మృత దేహం


కౌడిపల్లి, మే (ఆంధ్రజ్యోతి) 21: అనారోగ్యంతో బాధ పడుతున్న వ్యక్తి చెరువుల దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని సదాశివపల్లిలో మంగళవారం జరిగింది. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి కృష్ణ(34) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో తీవ్ర మనస్థాపం చెంది తన కుటుంబీకులతో ఆరోగ్య సమస్యలపై తరచూ ఆవేదన వ్యక్తం చేసేవాడు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన కృష్ణ తిరిగిరాలేదు. అదే రోజులు కుటుంబీలు గాలించగా కనికల చెరువుకట్టపై దుస్తులు, చెప్పులు కనిపించాయి. దీంతో చెరువులో పడిఉంటాడని భావించి గాలించినా ఫలితం లేకపోయింది. బుధవారం ఉదయం నర్సాపూర్ నుంచి రెస్క్యూ టీం కౌడిపల్లి పోలీసుల సహకారంతో చెరువులో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. మృతుడికి భార్య శోభతో పాటు కూతుళ్ల అనుప్రియ, విష్ణుప్రియ ఉన్నారు.


కోమటి కుంటలో చేపలు మృత్యువాత




కోమటికుంటలో చనిపోయిన చేపలు

నర్సాపూర్, మే 21(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్-తూప్రాన్ ప్రధాన రోడ్డు సమీపంలో పట్టణానికి అతి సమీపంలో ఉన్న కోమటికుంటలో చేపలు పెద్ద మొత్తంలో చనిపోయాయి. బుధవారం చేపలు పట్టడానికి వచ్చిన మత్స్యకారులకు పెద్దసంఖ్యలో చేపలు చనిపోయి ఒడ్డుకు కొట్టుకు వచ్చిన దృశ్యం కనిపించడంతో హతాశులయ్యారు. కోమటి కుంటలోకి సమీపంలోని ఇళ్ల నుంచి పెద్దఎత్తున డ్రైనేజీ నీరు రావడంవల్లే నీరు కలుషితమై సుమారు 10 క్వింటాళ్ల చేపలు చనిపోయాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని వాపోతున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.







మార్డి పెద్దచెరువు భూముల సర్వే

కల్హేర్, మే 21(ఆంధ్రజ్యోతి) : మండల పరిధి మార్డి గ్రామంలోని పెద్దచెరువు భూముల సర్వేను బుధవారం కల్హేర్ తహసీల్దార్ శివశ్రీనివాసులు ఆధ్వర్యంలో చేపట్టారు. ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి చెరువు భూమిని కబ్జాకు యత్నించగా 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో కలెక్టర్, ఆర్డీవో ఆదేశాల మేరకు కబ్జాకు గురైన భూమితో పాటు చెరువుపై భాగంలో ఉన్న భూముల్లోనూ సర్వే నిర్వహించారు. మ్యాప్ ప్రకారం చెరువు హద్దులను గుర్తిస్తామని, నీటిపారుదల శాఖ అధికారులు ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధారిస్తారని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. సర్వేలో రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జా చేసిన భూమితో పాటు చుట్టూ ఉన్న సుమారు 45 ఎకరాల చెరువు భూములను కబ్జాకు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. హద్దులు ఏర్పాటు చేసిన అనంతరం కబ్జాకు పాల్పడిన వారందరికీ నోటీసులు అందజేసి కేసులు నమోదు చేయనున్నట్లు తెలిసింది. ఈ సర్వే పనుల్లో సర్వేయర్ ప్రభాకర్, సహాయకులు శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది రవి, ఎల్లయ్య, నాయకులు ఎన్నం సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించాలి

● సంగారెడ్డి జిల్లా కోర్టు మూడో అదనపు న్యాయాధికారి సునీతారవీంద్రారెడ్డి



మాట్లాడుతున్న న్యాయాధికారి సునీతారవీంద్రారెడ్డి

సంగారెడ్డి క్రైం, మే 21 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించేలా కృషి చేయాలని సంగారెడ్డి జిల్లా కోర్టు మూడో అదనపు న్యాయాధికారి సునీతారవీంద్రారెడ్డి కోరారు. జిల్లా కోర్టులో బ్యాంకు, ఇన్సూరెన్స్, చిట్‌ఫండ్స్ అధికారులతో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చేనెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. ఇందులో మోటార్ వెహికిల్ ప్రమాద కేసులు, బ్యాంకు మొండి బాకియిలు, చిట్‌ఫండ్ ఇపి కేసులు రాజీ పడే అన్ని కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఎక్కువ కేసులు పరిష్కరించి కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి డీవీఆర్ తేజో కార్తీక్, బ్యాంకు, ఇన్సూరెన్స్, చిట్‌ఫండ్స్ అధికారులు పాల్గొన్నారు.

నక్కల(పిట్టల) వారిని ప్రభుత్వం ఎస్టీలుగా గుర్తించడంతో ఎనిమిదేళ్ల పోరాటం ఫలించింది. రాష్ట్రంలో ఉన్న 20 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నది. సిద్దిపేట జిల్లాలో తొగుట మండలం ఎక్కువగా ఉన్న నక్కల కులస్థులు ఈ నిర్ణయంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చిన్న ముత్యంపేట(పిట్టలవాడ)కు చెందిన నక్కల కులస్థులు బుధవారం ఎస్టీ సర్టిఫికెట్‌ను సైతం పొందారు.


చిన్నముత్యంపేటలోని నక్కల కులస్థులతో సమావేశమైన తొగుట తహసీల్దార్ శ్రీకాంత్

పోరాటం ఫలించే

ఎస్టీ జాబితాలోకి నక్కల కులస్థులు

సామాజిక సమరసత వేదిక నేతృత్వంలో ఎనిమిదేళ్లుగా ఉద్యమం

రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల కుటుంబాలకు లబ్ధి

సిద్దిపేట జిల్లాలో 600 కుటుంబాలు

చిన్నముత్యంపేట గ్రామస్థులకు సర్టిఫికెట్ అందజేత


ఎస్టీ సర్టిఫికెట్‌ను చూపిస్తున్న నక్కల కులస్థులు

తొగుట, మే 21 (ఆంధ్రజ్యోతి) : పోరాటం ఫలించింది. నక్కల (పిట్టల) వారిని ఎస్టీలుగా గుర్తిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలో ఉన్న 20 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నది. సిద్దిపేట జిల్లాలో తొగుట మండలం ఎక్కువగా ఉన్న నక్కల కులస్థులు ఈ నిర్ణయంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చిన్నముత్యంపేట(పిట్టలవాడ) నక్కల కులస్థులు బుధవారం ఎస్టీ సర్టిఫికెట్‌ను సైతం పొందారు.

సామాజిక సమరసత వేదిక నేతృత్వం

సిద్దిపేట జిల్లాలో ముత్యంపేటతో పాటు దమ్మక్కపల్లి, నర్సాయిపల్లి, మందపల్లి, రాఘవాపూర్, దుబ్బాక, ధర్మారం, బస్వాపూర్, సలాక్‌పూర్, చిట్టాపూర్ తదితర 12 గ్రామాల్లో 600 వరకు నక్కలజాతి కులస్థులు ఉన్నారు. చిన్నముత్యంపేట గ్రామంలోనే సుమారు 80 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. నక్కల కులస్థులు పిట్టలు పట్టుకుంటూ బతుకులు వెళ్లదీస్తుండటంతో పాటు 95 శాతం మంది నిరక్షరాస్యులు. కాగా వారికి ఎలాంటి కుల సర్టిఫికెట్ లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక, వెనుకబాటుకు లోనయ్యారు. వారిలో మార్పును తీసుకురావడానికి సామాజిక సమరసత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అప్పాల ప్రసాద్ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. విద్య, వైద్యం అందేలా స్వచ్ఛంద సంస్థల సహకారంతో చేయూతనందించే కార్యక్రమాలు చేపట్టారు. సామాజికంగా వారిని ముందుకు తీసుకెళ్లందుకు కృషి చేస్తున్నారు. నక్కల జాతి కులస్థులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని సామాజిక సమరసత వేదిక నేతృత్వంలో ఉద్యమ బావుటాను ఎగురవేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కులస్థులను ఏకం చేసి ఎనిమిదేళ్లుగా పోరాడుతున్నారు. పిట్టలవారు ఉన్న ప్రాంతంలోని రెవెన్యూ అధికారులకు ఎన్నో వినతి పత్రాలను అందజేశారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దృష్టికి తీసుకెళ్లి చివరికి సఫలీకృతమయ్యారు. నేటికి వారి స్వప్నం నెరవేరింది. ఇన్నాళ్ల పోరాటానికి ఫలితం దక్కింది.

ఎనిమిదేళ్ల పోరాట ఫలితం



నక్కల కులస్థులను ఎస్టీ జాబితాలోకి చేర్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయం. సామాజిక సమరసత వేదిక ఎనిమిదేళ్ల పోరాటానికి ఫలితం దక్కింది. విద్యా, ఉద్యోగ, సంక్షేమ రంగాల్లో నక్కల కులస్థులకు న్యాయం జరుగుతుంది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి కృషి మరువలేనిది.

- అప్పాల ప్రసాద్, సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్

ప్రభుత్వ నిర్ణయంతో వెలుగులు



ప్రభుత్వ నిర్ణయంతో మా నక్కల కులస్థుల జీవితాల్లో వెలుగులు రానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పిట్టల కులస్థులందరికీ ఎస్టీ సర్టిఫికెట్‌లు అందేలా కృషి చేస్తాం. సామాజిక సమరసత వేదిక కృషి వల్లనే ఇది సాధ్యమైంది.

- యాదగిరి, నక్కల కులస్థుల రాష్ట్ర సంక్షేమ సంఘం కన్వీనర్

ఎస్టీ సర్టిఫికెట్ ఇవ్వడం సంతోషకరం



చాలా ఏళ్లుగా కులం సర్టిఫికెట్ లేక ఇబ్బందులు పడ్డాం. అధికారుల చుట్టూ తిరిగినప్పటికీ ఒకసారి 2005లో అధికారులు ఎస్టీ సర్టిఫికెట్ మంజూరీ చేసి మళ్లీ రద్దు చేశారు. ఇన్నాళ్లకు ప్రభుత్వం ఎస్టీ సర్టిఫికెట్‌లు మంజూరీ చేయడం సంతోషంగా ఉంది.

- తుమ్మల రాజు, చిన్నముత్యంపేట,

ఎస్టీ సర్టిఫికెట్‌లు మంజూరు

తొగుట మండలం చిన్నముత్యంపేట నక్కల కులస్థులకు ఎస్టీ సర్టిఫికెట్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించాం. మీ సేవలో దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి ఎస్టీ సర్టిఫికెట్ మంజూరు చేస్తున్నాం. సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పథకాలను పొందాలి.

- శ్రీకాంత్, తొగుట తహసీల్దార్



విజేతగా నిలిచి కప్‌ను అందుకుంటున్న నిజామాబాద్ జట్టు

సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ విజేత నిజామాబాద్

రన్నరప్‌గా నిలిచిన మెదక్ జిల్లా జట్టు


రన్నరప్ కప్‌ను అందుకుంటున్న మెదక్ జట్టు

తూప్రాన్, మే 21(ఆంధ్రజ్యోతి) : 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులో తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాల క్రీడా ప్రాంగణంలో 19న ప్రారంభమైన క్రీడా పోటీలు, బుధవారంతో ముగించారు. ఫైనల్ పోటీల్లో మెదక్, నిజామాబాద్ జిల్లా జట్టు పోటీ పడగా నిజామాబాద్ జట్టు 6-1 స్కోర్ తేడాతో విజయం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నది. మెదక్ జిల్లా జట్టు రజత పతకం, హన్మకొండ జట్టు కాంస్య పతకం దక్కించుకుంది. తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉత్తమ పిచర్‌గా చందు (నిజామాబాద్), ఉత్తమ క్యాచర్‌గా సుమన్ (మెదక్), ఉత్తమ బ్యాటర్‌గా పావన్ (హన్మకొండ), ఉత్తమ ఆల్‌రౌండర్‌గా తరుణ్ (మెదక్) అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అభిషేక్‌గౌడ్, ప్రధానకార్యదర్శి నవీన్‌కుమార్, కోశాధికారి రేణుక, జిల్లా అధ్యక్షుడు కొడిప్యాక నారాయణగుప్తా, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీలకు కొత్త మార్గదర్శకాలు

● గత నెలలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో కార్యదర్శులకు అవగాహన



దుబ్బాక, మే 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల పాలన వ్యవహారాల్లో మార్పులను తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. విధులు, నిర్వహణ, సేవలను ప్రస్తావిస్తూ సర్క్యులర్ మెమో నంబర్ సీపీఆర్ఆర్ఈడీ 4/జీపీపీడీ/ఎస్ఏఎన్/8/2025 డీ సెక్షన్‌ను విడుదల చేశారు. గ్రామాల్లో పచ్చదనం, పారిశుధ్యం, చెత్తసేకరణ, తాగునీటి నిర్వహణ, పౌరసేవలు, ఇతర విభాగాల పర్యవేక్షణ గురించి మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ అధికారులకు సర్క్యులర్ అందింది. అయితే, గత నెలలోనే పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఇందులోని అంశాలపై అవగాహన కల్పించారు.

నూతన మార్గదర్శకాలలో చెత్త సేకరణ, ఎరువుల తయారీతో పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవడానికి ప్రాధాన్యం కల్పించారు. దీని కోసం జోన్‌ల వారీగా విభజించి ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను, దుకాణాలు, మార్కెట్ల నుంచి వ్యర్థాలను సేకరించాలని తెలిపారు. డంప్‌యార్డులను పునరుద్ధరించి, సేంద్రియ ఎరువుల తయారీని చేపట్టాలని, ఇందులో సుమారు 24 అంశాలను ప్రతిపాదించారు. ఇక తాగునీటి నిర్వహణను మిషన్ భగీరథ సిబ్బంది సమన్వయంతో చేపట్టాలని సూచించారు. తాగునీటి క్లోరినేషన్‌తోపాటు, పరీక్షలు నిర్వహించాలని, ఎంపీవో, డీపీవో, డీఎల్‌పీవో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని పేర్కొన్నారు. ఎంపీవో మూడు నెలల్లో అన్ని గ్రామపంచాయతీలను, డీపీవోలు నెలలో తప్పనిసరిగా ఐదు పంచాయతీల్లో తనిఖీలు చేయాలని ఆదేశించారు. ప్రత్యేక యాప్ ద్వారా అధికారులను సమన్వయపరుస్తూ పంచాయతీల పాలనపై పర్యవేక్షణ కొనసాగుతుందని మార్గదర్శకాలల్లో తెలిపారు.

సెల్‌ఫోన్ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణ

● ఎస్‌బీఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్

సంగారెడ్డి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు సెల్‌ఫోన్ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్టు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఎస్‌బీఆర్ఎస్ఈటీఐ) డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 45 ఏళ్ల లోపు ఉన్న యువకులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల వారు ఈనెల 27వ తేదీలోగా సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు పదో తరగతి ధ్రువీకరణ పత్రం, రేషన్, ఆధార్ కార్డుల జీరాక్స్ ప్రతులు, నాలుగు ఫొటోలు, బ్యాంకు ఖాతా వివరాలను జత చేయాలని సూచించారు. ఎంపికైన వారికి ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 26వరకు శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సెల్‌ఫోన్ రిపేర్ టూల్ కిట్ ఇవ్వనున్నామని తెలిపారు. పూర్తి సమాచారం కోసం 9490103390, 9490129839 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

24న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

మెదక్ అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): 11వ తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల కోసం ఈనెల 24న జిల్లా స్థాయి ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. ఉదయం 9 గంటలకు మెదక్ స్టేడియంలో అండర్-8, 10, 12 బాలబాలికలకు రన్స్, త్రో జేమ్స్ విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు వచ్చే నెల జూన్ 1న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని ఆయన వెల్లడించారు. మిగితా వివరాలకు 9963005540 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

జహీరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి) : రేపు జహీరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, తదితరులు పరిశీలించారు. ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట ఆర్డీవో రాంరెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, నాయకులు, తదితరులు ఉన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, ఆర్డీవో

అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి : కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ నియోజకవర్గంలో 23న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో గురువారం వరకు అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. హెలీప్యాడ్, సభాస్థలి ఏర్పాట్లు, హెలిప్యాడ్ నుంచి సభాస్థలి వేదిక వరకు రోడ్డు పనులు పూర్తి చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్, రూట్ల వారీగా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రణాళిక వివరాలు, స్టేజీ అలంకరణ, పరిశుభ్రత, మిషన్ భగీరథ తాగునీరు, మరుగుదొడ్లు, సభకు హాజరయ్యే ప్రజలకు సౌకర్యాలు అన్ని పనులను నేటి వరకు పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నశంకరంపేట మండలంలోని గజగట్లపల్లిలో బుధవారం మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో గవ్వలపల్లి చౌరస్తా నుంచి గజగట్లపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

- చిన్నశంకరంపేట, మే 21 (ఆంధ్రజ్యోతి)

ప్రదక్షిణంతో పవనసుతుడి కటాక్షం

భక్తుల కోర్కెలు తీర్చే మల్లెంచెరువు కట్ట కింది వీరహనుమాన్

మెదక్ అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న క్షేత్రం మెదక్ పట్టణంలోని మల్లెంచెరువు కట్ట కింది వీరహనుమాన్ ఆలయం. ఆంజనేయస్వామి ఆలయాల్లో ఒక్కొక్క ఆలయం ఒక్కొక్క విశిష్టతను కలిగి ఉంటుంది. ఇక్కడ ప్రదక్షిణలు చేసి మనసులోని కోరికను పవనసుతుడికి నివేదిస్తే తప్పకుండా నెరవేరుతుందని భక్తుల నమ్మకం. నిత్యం వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తుంటారు. మంగళ, శనివారాల్లో ప్రత్యేక పూజలతో ఆలయం విరాజిల్లుతోంది.

1964 సంవత్సరంలో బెంగళూరేకు చెందిన రామయ్య పంతులు ఇక్కడి వచ్చి, స్వామి వారిని ప్రతిష్ఠించి నిత్యపూజలను జరిపిస్తున్నారు. ఆయన తదనంతరం వారి వారసులే స్వామి వారి పూజ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు.


మెదక్‌లోని మల్లెంచెరువు కట్ట కింది వీరహనుమాన్ ఆలయం



వీర హనుమాన్‌స్వామి

వీరహనుమాన్ ఆలయంలో గణపతి, సూర్యదేవుడు, శివపార్వతులు, సత్యనారాయణ స్వామి, నాగదేవత విగ్రహాలు ఉన్నాయి. ఆలయ ప్రాంగణంలో ఏళ్లనాటి రాగి చెట్టు, నవగ్రహాలు ఉన్నాయి. ప్రతీ పండుగను ఈ ఆలయంలో అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. నేటి హనుమాన్ జయంతికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నమ్మకంతో భక్తుల ధార్మిక ఆచరణ

ఇక్కడ భక్తులు విశేషంగా ఆచరించే ధార్మిక విధి ప్రదక్షిణలు చేయడం. వివాహం కానివారు, వైవాహిక బంధంలో ఇబ్బందులు ఉన్నవారు, ఆర్థిక ఇబ్బందులు, వ్యాపారంలో నష్టాలు, ఉద్యోగంలో ఉన్నతి లేనేవారు.. ఇలా అనేక ఈతిబాధలు ఉండి ఏ పని చేసినా కలిసిరాని వారు స్వామిని దర్శించి, కోరికను విన్నవించి ప్రదక్షిణలు చేస్తారు. 41 రోజుల పాటు నిత్యం చేసేవారు కొందరైతే, అర్చకుల సూచన మేరకు 7 మంగళవారాలు ప్రదక్షిణలు చేసే వారు మరికొందరు. కోరిక తీరిన తర్వాత 108 ప్రదక్షిణలు చేయడం ఇక్కడి భక్తుల నమ్మకం.

భక్తుల కొంగుబంగారం వీరహనుమాన్‌స్వామి



వీర హనుమాన్ స్వామిని దర్శించుకుంటే కోరిక కోర్కెలు తీరుతాయి. ఆలయంలో నిర్వహించే నిత్య హారతులు, అభిషేకాలు చేస్తూ.. ఆధ్యాత్మికతతో స్వామి వారి సన్నిధి విరాజిల్లుతోంది. నిత్య ప్రదక్షిణలు చేసే వారి కోరిన కోర్కెలు తీర్చే స్వామి భక్తుల పాలిట కొంగు బంగారం. హనుమన్ జయంతి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ప్రతి ఏటా వేడుకలు వైభవంగా నిర్వహిస్తాం.

- కొత్తకోట ప్రసాద్‌శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు

బోధనలో సాంకేతికతను జోడించాలి

● ఉపాధ్యాయ శిక్షణ శిబిరాల రాష్ట్ర పరిశీలకుడు భాస్కర్ దేశ్


మాట్లాడుతున్న భాస్కర్‌దేశ్

మెదక్ అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు బోధనకు అత్యాధునిక సాంకేతికతను జోడించాలని రాష్ట్ర పరిశీలకులు భాస్కర్ దేశ్ సూచించారు. మెదక్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో రెండు రోజులుగా కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా సాంకేతిక పద్ధతులను బోధనలో వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో రాజిరెడ్డి, కోర్సు కోఆర్డినేటర్, హెచ్ఎం రేఖ, రిసోర్స్ పర్సన్‌లు తదితరులు పాల్గొన్నారు.




చేర్యాల పట్టణంలోని కొమ్మూరి నివాసంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిలో కాంగ్రెస్ నాయకులు, సిద్దిపేటలోని పొన్నాల వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పూజల హరికృష్ణ, అత్తుఇమామ్

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

న్యూస్‌నెట్‌వర్క్, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు, ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.



చిన్నకోడూరులో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులార్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

న్యూస్ బాక్స్

డ్రంకెన్ డ్రైవ్‌లో 11మందికి జరిమానా

గజ్వేల్, మే 21 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన పదకొండు మందికి రూ.16వేల 500 జరిమానా విధిస్తూ గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి తెలిపారు. గత కొన్ని రోజుల క్రితం గజ్వేల్ పట్టణంలోని ఆయా చౌరస్తాలలో డ్రంకన్ డ్రైవ్ టెస్టులు జరుపగా, పదకొండు మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరచగా, విచారణ చేపట్టిన న్యాయమూర్తి పదకొండు మందికి రూ.11,500 జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారని సీఐ తెలిపారు.

సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కొన్ని రోజుల క్రితం నుంచి సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 11 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొన్నారు. వారిని బుధవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ చేసి 11 మందికి రూ .17000 జరిమాన విధించారు.

రూ.2.50లక్షల ఎల్‌వోసీ

21సీఆర్‌ఎల్-1 బాధితుడి కుటుంబసభ్యులకు ఎల్‌ఓసీ ప్రతి అందజేస్తున్న మాజీ సర్పంచు కొండపాక భిక్షపతి

చేర్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన కుక్కల లింగం వెన్నముక సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో చేరినప్పటికి ఆపరేషన్ కయ్యే ఖర్చులు భరించే స్థోమతలేక ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలిసిన మాజీ సర్పంచ్ కొండపాక భిక్షపతి ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి విన్నవించడంతో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2.50లక్షలమేర ఎల్‌వోసీ మంజూరు చేశారు. ఈమేరకు బుధవారం ఎల్‌ఓసీ పత్రాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

అక్రమ కార్యకలాపాలపై పటిష్ఠ నిఘా

బెజ్జంకి, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక, మట్టి అక్రమ రవాణా, ఇతర అక్రమ దందాల పై పటిష్ఠమైన నిఘాను ఏర్పాటు చేసినట్లు ఏఎస్సై శంకర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలో అక్రమ దందాలను అరికట్టేందుకు గ్రామాల్లో నిరంతరం పెట్రోలింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉన్న పౌల్ట్రీ ఫామ్స్, రైస్ మిల్లులు, కంపెనీలలో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల కదలికలను పోలీసు సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు, సంబంధిత యాజమానులు ఏర్పాటు చేసిన షెల్టర్‌లలోనే ఉండాలని, రాత్రి వేళల్లో బయట తిరగకూడదని తెలిపారు. అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తు నిబంధనలు ఉల్లంఘించిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నవ వధువుకు పుస్తె, మెట్టెలు అందజేత

మర్కుక్, మే 21 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన మేకల రజిత రమేష్ కూతురు వైశాలి వివాహానికి పుస్తెమట్టెలు అందజేసిన మేకల కనకయ్య ముదిరాజ్ వారితో పాటు పాములపర్తి బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పిట్ల మహేష్, తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠవేడుకలు



పూజాకార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

చేర్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం దానంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ, శీతలాదేవీనాభిశిల ప్రతిష్ఠాపన వేడుకలు బుధవారం అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా దేవతా మంటపారాధన, కలశస్థాపన, తదితర విశేష పూజలను శాస్త్రోక్తయుక్తంగా జరిపారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూమికి సారం

సిద్దిపేట రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట ఎరువులు సాగు చేస్తూ వాటిని భూమిలో కలియదున్నితే భూమి సారవంతంగా మారి సాగు చేసే పంటకు లాభదాయకంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి బి. పరశురామ్ రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సబ్సిడీ పై వచ్చిన జనుము విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ పరశురామ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ముందుగా జనుము విత్తనాలను రైతులకు సబ్సిడీ పై అందజేస్తుందని, త్వరలోనే జీలుగ విత్తనాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులతో రసాయన ఎరువుల వాడకం తగ్గి భూసారం పెరుగుతుందని చెప్పారు.

తొగుట

యాభై శాతం రాయితీపై జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తొగుట మండల వ్యవసాయ అధికారి మోహన్ సూచించారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

బెజ్జంకి, మే 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి సంతోష్ తెలిపారు. జీలుగ విత్తనాలు-100 బస్తాలు వ్యవసాయ సహకారసంఘంలో జనుము-50 బస్తాలు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. సబ్సిడీ పై జనుము 40 కేజీల బ్యాగు రూ. 2,510, జీలుగ 30 కేజీల బ్యాగు రూ. 2,138 కి ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ

దౌల్తాబాద్ /కొండపాక/మద్దూరు/చేర్యాల/రాయపోల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులకు ఇచ్చే శిక్షణ ఉపయోగపడుతుందని మెదక్ ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్, రాష్ట్ర పరిశీలకులు గంగయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన దౌల్తాబాద్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి ఉపాధ్యాయుల రెండవ రోజు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సమాజానికి అనుగుణంగా ఉపాధ్యాయులకు శిక్షణ అందించి పాఠశాల స్థాయిలో అది వినియోగించబడాలని అన్నారు. రాయపోల్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. శిక్షణ కొనసాగుతున్న విధానాన్ని పరిశీలించారు. సాంకేతికతను ఉపయోగించి బోధనను ఆసక్తిగా మార్చి నాణ్యమైన విద్యను అందించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తోడ్పడాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కొమురవెల్లి మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణను బుధవారం సిద్దిపేట జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడం కోసం ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్య శిక్షణను అందిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కొండపాక మండలం దుద్దెడలో జరుగుతున్న ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఉపాధ్యాయులు మారుతున్న టెక్నాలజీ అనుకూలంగా తమ విద్యా బోధనను మెరుగుపరచుకోవాలని, ప్రస్తుత ఏఐ టెక్నాలజీకి అనుబంధంగా అప్డేట్ అవ్వాలన్నారు.

అన్నదాత అరిగోస

(5వ పేజీ తరువాయి)

కేంద్రాల్లో సరిపడా స్థలం లేకపోవడంతో రహదారులపై ఆరబెడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇదంతా సేకరించాలంటే మరో పదిహేను రోజులు పట్టే పరిస్థితులు నెలకొన్నాయి. అప్పుడు కూడా పూర్తికాకుంటే వానలు మొదలైతే కేంద్రాల్లో ఉన్న ధాన్యానికి ముప్పు తప్పదు. అందుకే వెనువెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తేనే అన్ని సమస్యలకు పరిష్కారమవుతుంది. లేదంటే భారీ మూల్యాన్ని చెల్లించక తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతీరోజు వ్యాయామం తప్పనిసరి

● కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రంగనాయక సాగర్ ప్రాజెక్టుపై సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జులై 27 న జరిగే హాఫ్ మారథాన్ వాల్ పోస్టర్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, సీపీ అనురాధ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలో ఉత్సాహవంతులైన యువతి, యువకులు పాల్గొనాలని సూచించారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వ్యాయామం రన్నింగ్ చేయాలన్నారు.

పచ్చదనం, పరిశుభ్రత నిర్వహణపై కార్యదర్శుల పాత్ర కీలకం

మద్దూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతల నిర్వాహణలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అన్నారు. బుధవారం మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో దూళిమిట్ట, మద్దూరు పంచాయతీ సెక్రటరీలకు ఎంపీడీవో రాంమోహన్ అధ్యక్షతన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవకీదేవి మాట్లాడారు. సిటిజన్స్ సర్వీసులో పంచాయతీల సెక్రటరీల పని తీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. గ్రామాల వారిగా పచ్చదనం పరిశుభ్రతలను పెంపొందించాలని తెలిపారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

గజ్వేల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆదేశించారు. గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలోని ఐకేపి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, గజ్వేల్ పట్టణంలోని ఫాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అకాల వర్షాలతో తడిచిన వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో నిలువ ఉండగా వెంటనే లారీలను రప్పించి, హమాలీలతో లారీలో వరిధాన్యాన్ని లోడ్ చేయించి మిల్లులకు పంపించారు.

అమృత్ పనులు వేగవంతం చేయాలి

గజ్వేల్, మే 21 (ఆంధ్రజ్యోతి): అమృత్ పనులను వేగవంతం చేయాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గజ్వేల్ పట్టణంలో అమృత్ 2.0లో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంకర్లను, వాటర్ పైపు లైన్ పనులను పరిశీలించారు. కంపోస్టు విధానాన్ని, షెడ్లలోని నిల్వ ఉన్న కంపోస్టును పరిశీలించారు.

రైతులు అధైర్య పడొద్దు

మిరుదొడ్డి,మే21(ఆంధ్రజ్యోతి):రైతులు పండించిన ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేయడం జరుగుతుందని డీఆర్‌డీఓ పీడి జగదేవ్ ఆర్య అన్నారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.

జిల్లాలో జోరు వాన

సిద్దిపేట ఆంధ్రజ్యోతి/జగదేవ్‌పూర్/హుస్నాబాద్/గజ్వేల్‌రూరల్/తొగుట/రాయపోల్ మే 21: నైరుతి రుతుపవనాల ప్రభావం కారణంగా జిల్లాలో పలుప్రాంతాల్లో మంగళవారం అర్ధరాత్రి, బుధవారం సాయంత్రం జోరువాన కురిసింది. గజ్వేల్ మండలంలో, అలాగే జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్, మునిగడప, ఇటిక్యాల, పీర్లపల్లి, ధర్మారం తదితర గ్రామాల్లో వర్షానికి ధాన్యం తడిసింది. హుస్నాబాద్‌లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం తడిసి ముద్దయ్యింది. తొగుట మండల కేంద్రంతో పాటు గుడికందుల, తుక్కాపూర్, ఎల్లారెడ్డిపేట తదితర గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోకి రైతులు తెచ్చిన ధాన్యం తడిసి ముద్దయింది. తుక్కాపూర్ కొనుగోలు కేంద్రాన్ని తొగుట తహసిల్దార్ శ్రీకాంత్ సందర్శించారు. రాయపోల్ మండలంలోని రాయపోల్ రెండు లారీల్లో ధాన్యం నింపుతున్న క్రమంలో వర్షం కురవడంతో కొంత మేర తడిసింది. గొల్లపల్లి, రాయపోల్ తదితర గ్రామాల్లో ఏపీఎం కిషన్ పర్యటించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. నంగనూరులో వీచిన వర్షం గాలి దుమారంతో విద్యుత్ తీగలు తెగిపడి పాడి గేదె మృతి చెందింది.

బీసీ సంక్షేమ శాఖ మంత్రిని కలిసిన డీవైఎస్‌ఓ వెంకటనర్సయ్య



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీవైఎస్‌ఓ వెంకటనర్సయ్య

హుస్నాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం జిల్లా క్రీడలు, యువజన అధికారిగా బాధ్యతలు చేపట్టిన జంగపల్లి వెంకటనర్సయ్య రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. క్రీడల పరంగా జిల్లాను రాష్ట్రంలో అగ్రగామీగా నిలుపాలని ఆయన వెంకటనర్సయ్యకు సూచించారు. క్రీడల పరంగా రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ద్వారా అవసరమైన నిధులను కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు. క్రీడా మౌళిక సదుపాయాల కల్పనతో పాటు క్రీడాకారుల ప్రయోజనార్థం కార్యక్రమాలు చేపట్టాలని డీవైఎస్‌ఓకు సూచించారు.

టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

●టీబీ అలర్ట్ ఇండియా ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్

సిద్దిపేట రూరల్, మే21 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని టీబీ అలర్ట్ ఇండియా ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్, రావురుకుల, చింతమడక, నారామణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌మాట్లాడుతూ క్షయా నివారణకు అన్ని రకాల మందులు లభిస్తున్నాయని చెప్పారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లైయితే వ్యాధి నిర్ధారణకు ప్రతి ఒక్కరూ తెమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు.

సబ్ స్టేషన్ నిర్మాణం నిలిపివేయాలి

కోహెడ, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లమిట్ట గ్రామంలో నూతనంగా చేపడుతున్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను నిలిపివేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చిట్యాల శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం డిప్యూటీ తాహసీల్దార్ దేవేంద్రకు రైతులతో కలిసి ఆయన వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొట్లమిట్ట గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మాణానికి గతంలో నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని సేకరిస్తున్నారన్నారు. ప్రభుత్వం నిరుపేదలకు గతంలో పట్టాలు ఇచ్చిందని తెలిపారు. ఈ భూమిని మళ్లీ ప్రభుత్వం తీసుకోవడం సరికాదని అన్నారు. పేద రైతులకు ఇచ్చిన భూమిని తీసుకుంటాననడం సరికాదన్నారు.

బీఆర్‌ఎస్‌పై కక్షసాధింపు చర్యలా?

హుస్నాబాద్‌రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడిగితే బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని ఇదిసరైన విధానం కాదని బీఆర్‌ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం హుస్నాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చిందన్నారు. కాని అధికారంలోకి వచ్చి 17 నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు.

వ్యక్తి అదృశ్యం

కొండపాక, మే 21 (ఆంధ్రజ్యోతి): కొండపాక గ్రామానికి చెందిన పొన్నాల మల్లేశం (50) అనే వ్యక్తి అదృశ్యం అయినట్టు ఆయన భార్య యశోద పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది. కుకునూరుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొండపాక గ్రామానికి చెందిన మల్లేశం కూలి నాలి చేసేవాడు. అప్పుడప్పుడు కుటుంబ సభ్యులతో గొడవలు జరిగేవి. మద్యం తాగి వచ్చి ఇంట్లో భార్యను తిట్టేవాడు. మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన మల్లేశం బుధవారం వరకు ఇంటికి రాకపోవడంతో తెలిసిన వారి వద్ద చుట్టుపక్కల వెతికినప్పటికీ ఆచూకి లభించలేదు. దాంతో మల్లేశం భార్య యశోద పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలి

సిద్దిపేట కలెక్టరేట్ మే 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్‌లో జరిగే విశ్వ గురువు మహాత్మా బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా బలిజ గౌరవ అధ్యక్షుడు నరుకుల శివప్ప కోరారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు భద్రప్ప తో కలిసి ఆయన మాట్లాడారు.

ప్రమాదకర బావి పూడ్చివేత

మద్దూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన ప్రమాదకరంగా మారిన వ్యవసాయ బావిని పూడ్చివేసి వాహనదారుల భయాందోళనలు తొలగించిన ఎస్సై షేక్ మహబూబ్ అలీని మండల ప్రజలు అభినందిస్తున్నారు. మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామ శివారు వల్లంపట్లకు వెళ్లేదారిలో కలకోటి నర్సింహారెడ్డికి చెందిన వ్యవసాయ బావి ప్రమాదకరంగా మారింది. ఎస్సై షేక్ మహబూబ్ అలీ వెంటనే ప్రమాదకరంగా మారిన వ్యవసాయ బావిని పూడ్చి వేయించారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలి

● సీపీ డాక్టర్ బి. అనురాధ

సిద్దిపేట క్రైం మే 21(ఆంధ్రజ్యోతి): గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌ల గురించి పిల్లలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ షీ టీం, భరోసా, స్నేహిత సిబ్బందికి సూచించారు. షీ టీం, భరోసా, స్నేహిత సిబ్బందితో పిల్లల రక్షణ గురించి తీసుకుంటున్న చర్యల గురించి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. షీ టీం బృందం, భరోసా సెంటర్ సిబ్బంది మహిళ రక్షణకు ఉన్న చట్టాల గురించి సైబర్ నేరాల గురించి సామాజిక రుగ్మతల గురించి గ్రామాలలో ప్రజలు పనిచేస్తున్న ప్రదేశానికి వెళ్లి అవగాహన కలిపించడం జరుగుతుందన్నారు. ఆడపిల్లల, మహిళల రక్షణకు మేమున్నామని పూర్తి నమ్మకం, భరోసా కలిపించాలని సూచించారు. షీటీం బృందం జిల్లాలో ఉన్న హాట్ స్పాట్స్ పై మరింత నిఘా పెంచి రోజుకు మూడు నాలుగు సార్లు సందర్శించాలన్నారు. మహిళలను, ఆడపిల్లలను కావాలని ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మౌనం వీడి ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. కొన్ని ఫోక్సో కేసుల వివరాలు యువతీ యువకులకు ప్రజలకు తెలిపి అవగాహన కలిపించాలన్నారు.

ముగిసిన డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్ర



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మహిళలు

కోహెడ, మే 21 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండల కేంద్రంలో డ్రగ్స్ నిర్మూలనపై చేపట్టిన పోరుయాత్ర బుధవారం ముగిసింది. హుస్నాబాద్ జేఏసీ కన్వీనర్ కవ్వా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలనపై 6 రోజులుగా ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని ఐకేపీ భవనం నుంచి జిల్లా పరిషత్ పాఠశాల వరకు మహిళలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పోరు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోయిని నిర్మల, సీడీపీఓ జయ, నియోజకవర్గ జేఏసీ కోఆర్డినేటర్లు మేకల వీరన్న యాదవ్,ద్యాగల సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ పని

చేర్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమంకోసమే కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పాటుపడుతుందని చేర్యాల మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు అన్నారు. చేర్యాల పట్టణానికి చెందిన పోతుగంటి కర్ణాకర్‌కు రూ.47,500, ముస్కాన్‌కు రూ.25వేలు, పర్హానాబేగంకు రూ.35,500 చొప్పున సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో సీఎంఆర్‌ఎఫ్‌లో అవినీతి తాండవమాడిందని, కానీ కాంగ్రెస్ ప్రజాపాలనలో కట్టుదిట్టం చేసి పారదర్శకంగా సహాయమందిస్తుందన్నారు .రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10లక్షలకు పెంచి పేదలకు వైద్యాన్ని చేరువచేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి దన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

హుస్నాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షులు చిట్టెల సంపత్ అన్నారు. బుధవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో జరిగిన దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం దివ్యాంగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, దివ్యాంగుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందన్నారు. రూ. 6వేలకు పెన్షన్ పెంచాలని, సదరం సర్టిఫికెట్ పొందిన దివ్యాంగులకు సంవత్సరాలు గడచినా పెన్షన్ రావడం లేదని, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాలని, అంత్యోదయ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించనట్లయితే ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమవుతామన్నారు.

కుంగిపోతున్నా పట్టించుకోరా



శ్వేత చిన్నపిల్లల ఆస్పత్రి సమీపంలో కాలువ గొయ్యి గోతి పూడ్చకపోవడంతో కుంగిపోయిన టైల్స్

చేర్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారి పక్కన కొద్ది రోజులక్రితం నాసిరకంగా చేపట్టిన ఫ్లోరింగ్ టైల్స్ కుంగిపోతూ అతీగతీలేకుండా మారాయి. ఎన్‌హెచ్ అధికారుల పర్యవేక్షణాలోపంతో పాటు కాంట్రాక్టర్ పనితీరుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా వృథాకాకుండా డ్రైన్‌కాలువలోకి మళ్లించేందుకు టైల్స్ ఏర్పాటుచేసినా, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో కుంగిపోయి డస్ట్ పేరుకుపోతున్నాయి. పలు ప్రదేశాలలో డ్రైన్‌కాలువ సరిగా చేపట్టకపోవడంతో టైల్స్ కోతకు గురై గుంతలు తేలుతున్నాయి. కొద్దిరోజుల క్రితం కురిసిన భారీవర్షంతో శ్వేత పిల్లల ఆస్పత్రి, తేరాల భద్రయ్య ఇంటి ఆవరణలో టైల్స్ కుంగి పనుల్లో డొల్లతనం బయల్పడ్డాయి. కానీ డ్రైయిన్ రెవిట్‌మెంట్ చేపట్టి పార్కింగ్ టైల్స్ సవరించకపోవడంతో వర్షం కురిసినప్పుడల్లా పునరావృతమవుతూవస్తుంది. పలుప్రదేశాలలో వరదనీరు నిలిచిపోతూ దోమలకు ఆవాసంగా మారాయి. చీకటివేళలో పాదచారులు నడుచుకుంటూ వెళుతున్న క్రమంలో దిగబడి ప్రమాదాలకు గురయ్యేయ పరిస్థితినెలకొన్నా నిద్రమత్తు వీడటం లేదు. జిల్లా ఉన్నతాధికారులు చొరవ వహించి ప్రమాదాలకు గురికాకముందే ప్రత్యామ్నాయ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'ఇంజనీరింగ్ ' ఫీజు పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి : ఏబీవీపీ

సిద్దిపేట కల్చరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలల ఫీజులను పెంచొద్దని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. సిద్దిపేట డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ సిద్దిపేట శాఖ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో మూడేళ్లకు ఒకసారి పెరిగే ఇంజనీరింగ్ కళాశాలల ఫీజులను ఇష్టారీతిన పెంచడానికి ప్రతిపాదనలు పంపిన టీఏఎఫ్ఆర్‌సీ నిర్ణయాన్ని ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. కళాశాలలు తప్పుడు ఆడిట్ లెక్కలు చూపిస్తూ ఫీజులు పెంచుకొని పేద విద్యార్థుల దగ్గర లక్షలకు లక్షలు డబ్బులు వసూలు చేయడానికి సిద్ధం అవుతున్నాయని మండిపడ్డారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల తీరు చూస్తుంటే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య అందని ద్రాక్ష లాగా మారేలా ఉందన్నారు.ఒకవైపు కళాశాలలు ఫీజులు పెంచుతుంటే మరోవైపు ప్రభుత్వం నుంచి వచ్చే ఫీజు రీయింబర్స్మెంట్ మాత్రం పెంచక విద్యార్థుల జేబులో నుండి డబ్బులు కట్టే పరిస్థితి నెలకొందన్నారు.

కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యలకు మూల్యం తప్పదు

గజ్వేల్ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే ఎత్తిపోతల ప్రాజెక్టుగా చరిత్రకెక్కిన కాళేశ్వరం నిర్మాణంలో అవినీతి పేరిట కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యలు సిగ్గుచేటని బీఆర్‌ఎస్ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ ముదిరాజ్ మహాసభ వైస్ చైర్మన్ కొట్టాల యాదగిరి ముదిరాజ్ విమర్శించారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ధాన్యం దిగుబడిలో రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్ కుటుంబంపై కక్షగట్టి కుట్రపూరిత చర్యలు చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.